క్లుప్తంగా

శరవేగంగా సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మాణం



కూరగాయల మార్కెట్‌లో వేస్తున్న సిమెంట్ గచ్చు

సాక్షి ఎఫెక్ట్...

రామభద్రపురం: మండల కేంద్రంలోని అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణం శనివారం శరవేగంగా చేపట్టారు. మార్కెట్ అభివృద్ధికి నోచుకోకపోవడంతో విక్రయదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న నేపథ్యంలో 2024 డిసెంబరు 21వ తేదీన 'ఆదాయం ఘనం.. సౌకర్యాలు ఖననం' శీర్షికన సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన పాలకులు, అధికారులు కలిసి రూ.25 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో మార్కెట్ అభివృద్ధి పనులు చేయిస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లతో పెంట పాఠశాల సిబ్బంది

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ క్యాలెండర్-2025ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

బాడంగి: మండలంలోని గ్రామాల్లో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిశాయి. మండలంలోని రామచంద్రాపురం, పిండ్రంగివలస గ్రామాల్లో ఉదయం చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి రైతులు సమర్పించిన అర్జీలను అధికారులు స్వీకరించారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తుపాను వర్షాల కారణంగా వాయిదాపడిన పినపెంకి గ్రామ రెవెన్యూ సదస్సు ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సుధాకర్ తెలిపారు. సదస్సులో మండల సర్వేయరు వెంకటరమణ, రీసర్వే డీటీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన



ప్రహరీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శనివారం పర్యటించారు. అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులతో పాటు ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధులు, రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతిరోజూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆమె సూచించారు. చివరి లైన్‌లోని కాలువలకు అవుట్‌లెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం పోలవానివలస శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆమె వెంట డీఈఈ కిరణ్‌కుమార్ ఉన్నారు.

సన్మార్గంలో నడవాలి

రాజాం సిటీ: యువత, విద్యార్థులంతా సన్మార్గంలో నడవాలని, అలాంటప్పుడే మెరుగైన సమాజం ఏర్పడుతుందని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక పట్టణంలోని తెలగవీధి ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వంగర: మండలంలోని అరసాడ జంక్షన్‌లోని వ్యాపారులకు సీసీ కెమరాల వినియోగం దాని ప్రయోజనాలపై రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు శనివారం అవగాహన కల్పించారు.

వర్మీకంపోస్ట్ తయారీ పరిశీలన

తెర్లాం: మండలంలోని పణుకువలస దగ్గరున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా రిసోర్స్‌పర్సన్(డీఆర్‌పీ) తమ్మిరెడ్డి వెంకటరమణ శనివారం సందర్శించారు. అనంతరం వర్మీకంపోస్ట్ తయారీని పరిశీలించి, కాసేపు మాట్లాడారు. చెత్తాచెదారం నుంచి తయారు చేసిన ఎరువును సబ్సిడీపై రైతులకు అందజేసి, పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని సిబ్బందికి సూచించారు. చెరువులు, కోనేరుల చుట్టూ పార్కుల ఏర్పాటుకు ముందుకురావాలని సర్పంచ్ చందక సత్యనారాయణను కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నీలిమ, పంచాయతీ కార్యదర్శి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలే అవరోధాలు!





సాలూరు రూట్‌లో అరుణోదయ స్కూల్ దగ్గర రోడ్డు పక్కనే నిలిచిన మురుగు నీరు, (ఇన్‌సెట్లో) రోడ్డు పక్కన దుకాణం వద్ద కాలువలో మురుగు తొలగిస్తున్న కార్మికులు

రామభద్రపురంలోని గాంధీ బొమ్మ జంక్షన్ నుంచి టీబీఆర్ థియేటర్ వరకు, అలాగే బొబ్బిలి, సాలూరు జంక్షన్‌ల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు డ్రెయిన్ల ఆనవాళ్లు లేకుండా శాశ్వత నిర్మాణాలు చేశారు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లల్లోకి మురుగునీరు వచ్చేస్తోంది. ఇంటి యజమానులు, దుకాణదారులు డ్రెయిన్లను కప్పేస్తూ రోడ్డు అంచుల వరకు నిర్మాణాలు చేయడం వల్లే జాతీయ రహదారి పక్కన ఉన్న డ్రెయిన్లలో సిల్టు తొలగింపు పనులు సజావుగా సాగడం లేదు. ఈ క్రమంలో ఏ చిన్న వర్షం కురిసినా రోడ్డు పక్కనే నీరు నిలిచి చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. రోజుల కొద్దీ నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు కూడా విపరీతంగా పెరిగి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధుల బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా షాపుల వద్ద డ్రెయిన్లను కాంక్రీట్ పలకలతో మూసివేయడంతో పలకల మధ్య సన్నని ఖాళీల ద్వారా అందినంత వరకు పారిశుద్ధ్య సిబ్బంది పూడికలు తీస్తున్నారు. ఆక్రమణలు పూర్తిగా తొలగించి, డ్రెయిన్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – రామభద్రపురం

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి



బి.సురేష్‌కుమార్

రాజాం: రాష్ట్ర వ్యాప్తంగా తొలగించిన ఆరోగ్యశాఖలోని 920 మంది హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ బొడ్డేపల్లి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను బలోపేతం చేయాలని ఆదేశిస్తూ జీవో విడుదల చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోందని, అటువంటి నిర్ణయమే ప్రభుత్వం తీసుకున్నట్లయితే తొలుత తొలగించిన కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను కౌన్సెలింగ్ నిర్వహించి, విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేకపోతే ప్రభుత్వం చేయాలనుకునే ఎంపీహెచ్ఏల సర్దుబాటు ప్రక్రియ, కౌన్సెలింగ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగాలు కోల్పోయిన వారంతా ఈ నెల 6వ తేదీన పోరుబాటకు సిద్ధం కావాలన్నారు.

నిరుద్యోగుల నిరీక్షణ



ఉద్యోగాలు కోసం ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

- జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై నిరుద్యోగుల గంపెడాశలు
- ఉద్యోగం వచ్చేంత వరకు రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ
- అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా నెరవేర్చని ఎన్నికల హామీలు
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

రామభద్రపురం:

ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారా అని నిరుద్యోగులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రచార సమయంలో ఏటా జాబ్ క్యాలెండర్ ఇవ్వడంతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు నిరుద్యోగులను ఊదరగొట్టారు. వారు అనుకున్నట్లే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇంతవరకు నిరుద్యోగులకు ఇస్తానన్న హామీలు ఊసే ఎత్తకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాబ్ క్యాలెడర్ ఊసు అటు ఉంచు.. అసలు నిరుద్యోగ భృతి అయినా ఇస్తే కోచింగ్‌లకు వెళ్లి, బాగా ప్రిపేర్ అవుతామని నిరుద్యోగులు అంటున్నారు.

అప్పట్లోనూ మోసమే..

2014 ఎన్నికల సమయంలోనూ అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు చెప్పారు. జాబ్ రావాలంటే.. బాబు రావాలని ప్రచారం హోరెత్తించారు. నమ్మిన జనం ఓట్లు వేసి గెలిపించారు. అప్పట్లో కూడా వారు అనుకున్నట్లే గెలిచారు కానీ హామీలు అమలు మాత్రం అటకెక్కించారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వకపోగా చివరి ఏడాది కొంతమందికే నిరుద్యోగ భృతి ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. ఇప్పుడు కూడా అప్పట్లో లాగే మోసమే చేస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి మరీ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చింది. ప్రస్తుతం బొబ్బిలి నియోజకవర్గంలోని లక్షలాది మంది నిరుద్యోగులు కూటమి ప్రభుత్వం ఎప్పుడు హామీలు అమలు చేస్తాదా అని ఎదురుచూపు చూస్తున్నారు. అయినా వారి నిరీక్షణకు తెర దించేదెప్పుడో ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

హామీలు నిలబెట్టుకోవాలి..



ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి వస్తాదని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా నిరుద్యోగ భృతిపై స్పష్టత కొరవడింది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. నెలకు రూ.3 వేలు ఇవ్వాలి.

– తెంటు గోపీనాథ్, ఎంఎస్సీ ఎంఈడీ, రామభద్రపురం

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి..



సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేస్తారా అని నిరుద్యోగులంతా వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడంతో ఆందోళన నెలకొంది.

– గేదెల చంద్రకళ, ఎంఎస్సీ బయోటెక్నాలజీ, రామభద్రపురం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి..



నిరుద్యోగ భృతి ఇచ్చి, ఆదుకోవాలి. ఉద్యోగాలు భర్తీ చేసేంత వరకు ప్రిపరేషన్ కోసం నిరుద్యోగ భృతి ఉపయోగపడుతుంది. ఎప్పటికీ నిరుద్యోగులుగా మిగిలిపోకుండా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా హామీలు నెరవేర్చాలి.

– కె.చంటి, ఎంఎస్సీ బీఈడీ, రామభద్రపురం

మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చొద్దు



మద్యం ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చవద్దని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై బొబ్బిలిలో విలేకరులతో శనివారం మాట్లాడిన ఆయన.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతోందని, కల్తీ మద్యం కూడా విరివిగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. మద్యం ధరలు తగ్గించడమంటే మద్యం తాగడాన్ని ప్రోత్సహించడమేనన్నారు. న్యూ ఇయర్ వేళ జిల్లాలోని మొత్తం 153 మద్యం షాపుల్లో రూ.7.21 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయంటే ఏ లెక్కన మద్యం తాగుతున్నారో గుర్తెరగాలన్నారు. నిత్యావసరాలు, విద్యుత్ చార్జీలు పెంచి, మద్యం ధరలు తగ్గించడమేంటని ప్రశ్నించారు. విజ్ఞులైన ప్రజలంతా ఆలోచన చేయాలని, ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను వ్యతిరేకించాలని కోరారు. – బొబ్బిలి

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి



బొబ్బిలి మండలం, కాశిందొరవలస గ్రామంలో పొలాల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని, దానిని అడ్డుకోవాలని ఆ రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి శనివారం వెళ్లి, హెచ్‌డీటీ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్న ఆ నిర్మాణంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్నందున, విచారణ జరిపించి నిర్మాణాన్ని ఆపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు చిట్టిబాబు, రమణ, పోలయ్య తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలిరూరల్

తక్షణమే వీఆర్‌వోను అరెస్ట్ చేయాలి



వీఆర్‌వో తీరును వ్యతిరేకిస్తూ నిరసనకు దిగిన దళిత సంఘాల నాయకులు, తదితరులు

బొబ్బిలి: వీఆర్‌వో అడపా గౌరీశంకర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని పారాది గ్రామానికి చెందిన దళిత మహిళ నగర పోలమ్మ.. పాసుపుస్తకాల కోసం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి ఇటీవల వెళ్తే అక్కడే ఉన్న వీఆర్‌వో గౌరీశంకర్ ఆమెను కులం పేరిట దూషించాడని తెలిపారు. ఈ మేరకు అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలన్నారు. అంతకుముందు వీఆర్‌వో తీరును వ్యతిరేకిస్తూ బొబ్బిలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పొట్నూరు శంకరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు గర్భాపు రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పిల్లి శంకరరావు, కన్నారావు, ఆర్.హరిబాబు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని చింతాడ వీఆర్‌వో గౌరీశంకర్.. పారాది గ్రామ మహిళ పోలమ్మ పట్ల వ్యవహరించిన తీరుపై డీఎస్పీ శ్రీనివాసరావు తహసీల్దారు కార్యాలయం వద్ద శనివారం విచారణ చేపట్టారు.

అంధుల అక్షరశిల్పి లూయిా బ్రెయిలీ

అంధుల అక్షరశిల్పి, అక్షరప్రదాత లూయిా బ్రెయిలీ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది అంతా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన చీకటి సూర్యుడు లూయిా బ్రెయిలీ అని, ఒక అంధుడైన బ్రెయిలీ.. అంధులకు అక్షర జ్ఞానం కల్పించేందుకు ప్రత్యేకంగా ఓ లిపి(చుక్కల లిపి)ని రూపొందించి, అందించారని వక్తలు కొనియాడారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి, ఇప్పుడు ఎంతోమంది అంధులు బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. అటువంటి మహనీయుల జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. – బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



తెర్లాంలో నాన్ భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంఈవో త్రినాధరావు, ఉపాధ్యాయులు



రేగిడి భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో ప్రసాదరావు తదితరులు



రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లూయిా బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో ఉపాధ్యాయులు



రామభద్రపురం భవిత కేంద్రంలో లూయిా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంఈవో తిరుమలప్రసాద్



బాడంగి: అంధుడైన బ్యాంకు ఉద్యోగి ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



రాజాం సిటీ: బ్రెయిలీ గొప్పతనం వివరిస్తున్నఎంఈవో ప్రవీణ్‌కుమార్

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త గ్రంధి మల్లిఖార్జునరావు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శనివారం పరామర్శించారు. జీఎంఆర్ సోదరుడు గ్రంధి చిన్నబాబు భార్య సరస్వతమ్మ అనారోగ్యం కారణంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాజేష్.. రాజాంలోని సంపత్ భవన్ పక్కనే ఉన్న చిన్నబాబు ఇంటికి వెళ్లి, సరస్వతమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలిపి, బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

రాజాం సిటీ: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సూచించారు. స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అన్ని సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు, ప్రిన్సిపాల్ ఎం.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20 మద్యంసీసాలు స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని గొర్లెసీతారాంపురం వద్ద 20 మద్యంసీసాలను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ మహిళను అరెస్ట్ చేశారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



పక్కి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డేలో మాట్లాడుతున్న పీవో విజయలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) డే, తల్లుల సమావేశాలు శనివారం నిర్వహించారు. కుసుమూరు, నందబలగ గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి, కాసేపు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని, ప్రీస్కూల్ పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలంతా సమయపాలన పాటించాలని, కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో జాగాన విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని, అలాగే గర్భిణులు, బాలింతలకు పక్కాగా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు.

వంగర: మండలంలోని మగ్గూరు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజనిదుర్గ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

తెర్లాం: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని కాగాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన శనివారం తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారిని బాగా చదివించేలా అవగాహన కల్పించాలన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లోని ప్రజలకు ఆదివారం సైతం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు శనివారం తెలిపారు. తాగునీటి ప్రధాన పైపులైన్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, సోమవారం నాటికి పనులు పూర్తి చేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

తెర్లాం/సంతకవిటి/వంగర/బాడంగి: మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం శనివారం ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి కళాశాలలకు వస్తున్న విద్యార్థులకు ఈ భోజన సదుపాయం ఎంతగానో ఉపకరిస్తుందని ఎంఈవోలు తెలిపారు.